# హరితహారంతో అటవీశాతం వృద్ధి

- నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి
- పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి
- హరితోత్సవంలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, జూన్ 19 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంతో అటవీశాతం పెరుగుతున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీశాతం పెంచేందుకు సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్లు చెప్పారు. హరితహారం మొక్కలు వృక్షాలుగా మారాయని, వాతావరణ కాలుష్యం అదుపులో ఉండడంతోపాటు సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ కాపాడి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై హరిప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

### క్రీడల్లోనూ రాణించాలి

వనపర్తిటౌన్, జూన్ 19 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. వనపర్తిలోని అభి స్పోర్ట్స్ ఆడిటోరియంలో వింగ్స్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయని, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం టోర్నీ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, డాక్టర్ మురళీధర్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు సునీల్ వాల్మీకి, నిర్వాహకులు తస్కూర్ ప్రశాంత్, అరవింద్, సలీంబాబా తదితరులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు చెట్లే ఆధారం



జడ్చర్ల డీటీసీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలి
- దేశంలోనే అతిపెద్దది కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు
- ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూన్ 19 : మానవ మనుగడకు చెట్లే ఆధారమని, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శిల్పారామం వద్ద నిర్వహించిన హరితోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు మహబూబ్‌నగర్‌లో 500 గజాల పార్కు ఉండేది కాదని, ప్రస్తుతం దేశంలోనే అతి పెద్దదైన కేసీఆర్ ఎకో అర్బన్ పార్కు ఏర్పాటు చేశామని తెలిపారు. 2087 ఎకరాల విస్తీర్ణం కలిగిన పార్కులో జంగల్ సఫారీతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే శిల్పారామం, మినీ ట్యాంక్‌బండ్, నక్లెస్‌రోడ్డు వంటి నిర్మాణాలు చేపట్టి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. వీటన్నింటినీ విద్యార్థులు ఉచితంగా తిలకించే ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండునెలల్లో సస్పెన్షన్ బ్రిడ్జి, మినీ ట్యాంక్‌బండ్ తదితర పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహిళలు తయారు చేసిన విత్తన బంతులతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు రావడం అభినందనీయమన్నారు. పుట్టినరోజు ఇతరత్రా వేడుకల సందర్భంగా మొక్కలు నాటి సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పలువురికి మెమెంటోలు అందజేసి సన్మానించారు. వివిధ పోటీల్లో ప్రతిభకనబర్చిన 12మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి, కలెక్టర్ జి.రవినాయక్, అదనపు కలెక్టర్ సీతారామారావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ క్షితిజ, డీఎఫ్‌వో సత్యనారాయణ, డీఆర్డీవో యాదయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ నటరాజ్, ఎకో క్లబ్ అధ్యక్షుడు గన్నోజు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### పాలమూరుపై విషం కక్కేటోళ్లకు గుణపాఠం చెప్పాలి

జడ్చర్ల టౌన్, జూన్ 19 : పచ్చబడిన పాలమూరును చూసి ఓర్వలేక కొందరు విషం కక్కుతూ జిల్లాను నాశనం చేయాలని చూస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జడ్చర్లలోని జిల్లా పోలీసు శిక్షణాకేంద్రంలో ఏర్పాటు చేసిన హరితోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొని నర్సరీని ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను ఆగం చేసినోళ్లు.. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆగమవుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ప్రగతి సాధిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా గ్రీనరీ తెలంగాణలోనే పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. దేశంలో 96శాతం ప్రజలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా యాసంగిలో 96 లక్షల ఎకరాల్లో ధాన్యం పండితే, తెలంగాణలో 56లక్షల ఎకరాల్లో పంట పండినట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తే బడుగు, బలహీన వర్గాలు సంతోషంగా హారతి పట్టి స్వాగతం పలుకుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఒకప్పుడూ వలసల జిల్లాగా పేరొందిన పాలమూరు జిల్లా.. వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధి దిశగా పయనిస్తున్నదన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ తర్వాత మహబూబ్‌నగర్ నంబర్‌వన్ అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జోగుళాంబ జోన్ రేంజ్ డీఐజీ ఎస్‌కే. చౌహాన్, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నర్సింహ్మా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేశ్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో జ్యోతి, మున్సిపల్ చైర్మన్ దోరేపల్లి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్‌కుమార్

హరితహారం కార్యక్రమంలో ఉత్తమ మున్సిపాలిటీలుగా మహబూబ్‌నగర్, కల్వకుర్తి ఎంపికయ్యాయి. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన హరితోత్సవంలో హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ ప్రదీప్ కుమార్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ అశ్రిత్‌కుమార్ అవార్డు అందుకున్నారు.

- మహబూబ్‌నగర్ టౌన్/కల్వకుర్తి, జూన్ 19



అవార్డు అందుకుంటున్న కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ అశ్రిత్‌కుమార్



పుణెలో నిర్వహించిన సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి (ఫైల్)

# 'ఆత్మీయ' బంధం

- కొండంత అండను కట్టబెట్టిన సమ్మేళనం
- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై గిరిజనుల్లో పెరిగిన నమ్మకం
- 40ఏండ్ల కాలంలో ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్న సెటిలర్లు

నారాయణపేట, జూన్ 19 : మహారాష్ట్రలోని ముంబయి, పుణె పట్టణాల్లో ఇటీవల నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు విజయవంతం కావడంతో గులాబీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీల అసమర్థ పాలనతో ఉపాధి అవకాశాలు లేక ముంబయి, పుణె వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడే స్థిరపడిన తెలంగాణ ప్రాంత బిడ్డల ఆత్మీయ పలకరింపు కొండంత అండగా నిలిచింది. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ గెలుపు కోసం నారాయణపేట ప్రాంతవాసులు పని చేయాలని, అక్కడ ఎన్నికల్లో పోటీచేసి మన ప్రాంతవాసులే ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లుగా రాణించాలని, పార్టీ తరఫున సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి భరోసా కల్పించారు. అంతేకాకుండా మహారాష్ట్రకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుల గెలుపునకు తెలంగాణ బిడ్డలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ సెటిలర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా ఆదుకోవడంలో ముందుండాలని చెప్పడంతో మరింత ధైర్యం వచ్చినట్లయింది. దీంతో ఎమ్మెల్యేపై గిరిజనుల్లో మరింత నమ్మకం పెరిగింది. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వెళ్లి మహారాష్ట్రలోనే స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని 40ఏండ్లు కావొస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్క నాయకుడు తమ వద్దకు వచ్చి పలకరించిన పాపానపోలేదని సెటిలర్లు పేర్కొంటున్నారు. తెలంగాణలో తమకు ఓట్లు లేనప్పటికీ యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మహారాష్ట్రకు రావడంపై సం తోషం వ్యక్తం చేస్తున్నారు. వేరే రాష్ట్రంలో సభ నిర్వహించి సక్సెస్ సాధించిన వ్యక్తుల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నట్లయింది.

# ఆర్డీఎస్‌కు 5.374 టీఎంసీలు

- కేసీ కెనాల్‌కు 8.255 టీఎంసీల కేటాయింపు
- టీబీ డ్యాంకు 175 టీఎంసీలు వస్తాయని అంచనా..
- తుంగభద్ర బోర్డు సమావేశంలో నిర్ణయం




అయిజ, జూన్ 19 : ఆర్డీఎస్ ఆయకట్టుకు ఈ ఏడాది 5.374 టీఎంసీల నీటిని కేటాయిస్తూ తుంగభద్ర బోర్డు నిర్ణయం తీసుకున్నది. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వచ్చే వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని 2023-24 సంవత్సరానికిగానూ 175 టీఎంసీలు వస్తాయని బోర్డు అధికారులు, ఇంజినీర్లు అంచనా వేశారు. 175 టీఎంసీలను తెలంగాణ, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ (కృష్ణా వాటర్ డిస్పూట్స్ ట్రిబ్యూనల్) కేటాయింపులకు అనుగుణంగా దామాషా పద్ధతి ప్రకారం నీటి పంపకాలు చేపట్టారు. ఈనెల 8న కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం అతిథిగృహంలో తుంగభద్ర బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఎస్‌ఈలు, ఈఈలతో సమావేశం నిర్వహించారు. తుంగభద్ర నది పరీవాహక రాష్ట్రాలకు కేడబ్ల్యూడీటీ 212 టీఎంసీల నీటి కేటాయింపులు చేశారు. కర్ణాటకకు 138.990, ఏపీకి 66.500, ఆర్డీఎస్‌కు 6.510 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అవకాశం ఉంది. నాలుగైదేండ్లుగా తుంగభద్ర నదికి వస్తున్న వరదలను దృష్టిలో ఉంచుకొని 2023-24 సంవత్సరం 175 టీఎంసీల వరద వస్తుందని అంచనా. ఈ మేరకు కర్ణాటకకు 114.732, ఏపీకి 54.894, తెలంగాణ రాష్ట్రంలోని ఆర్డీఎస్ 5.374 టీఎంసీలను వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నారు.

### 50వేల ఎకరాలకు సాగునీరు

ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు 87,500 ఎకరాలు ఉండగా, ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంతోపాటు అలంపూర్, ఉండవెల్లి మండలాల పరిధిలోని లిఫ్టుల నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా కేటాయింపులకు అనుగుణంగా ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల సమన్వయంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.